సాక్షి వికారాబాద్

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



పోషకాల 'జావ'

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతిరోజు రాగిజావ అందిస్తోంది. 8లో▸



మహిళా బిల్లు చరిత్రాత్మకం

లోక్‌సభలో మహిళా బిల్లు ఆమోదం పొందడం చరిత్రాత్మకమని నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు అన్నారు. 8లో▸



బిల్లులు వచ్చేదెన్నడో?

అప్పులు చేసి గ్రామాభివృద్ధి చేస్తున్నా బిల్లులు రాకపోవడతో సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

'గ్యారంటీ కార్డు'తో కాంగ్రెస్‌లో చేరికలు

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ కార్డుతో ఇతర పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. బీసీ విద్యార్థి సంఘం జాతీయ జాయింట్ కన్వీనర్ మంగలి ఈశ్వర్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గుండ్ల మర్పల్లి ఉప సర్పంచ్ శ్రీనివాస్, బీజేపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ గొల్ల మల్లేష్, బీఆర్‌ఎస్ మండల నాయకుడు నంది కంటి రాజులు నగరంలోని గాంధీ భవన్‌లో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏఐసీసీ ప్రకటించిన గ్యారంటీ కార్డులోని అన్ని సంక్షేమ పథకాలను తూ.చా. తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గుండ్ల మర్పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలని వినతి

దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి వెంకటేష్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరికీ దళిత బంధు పథకం అందేలా చూడాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోరారు. గురువారం ఈ మేరకు కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద దళితుల కోసం తెచ్చిన దళిత బంధు పథకం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే అందుతోందన్నారు. చాలా చోట్ల నాయకులు కమీషన్లు మాట్లాడుకుని అనర్హులకు పథకం అందేలా చూస్తున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, అనంతయ్య, అంజిలయ్య, నారాయణ, ఎల్లమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల బంధు ప్రకటించండి

సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అడవయ్య

పరిగి: వికలాంగుల పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని దివ్యాంగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం పరిగి పట్టణంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు తరహాలో వికలాంగుల బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం – 2016లో పేర్కొన్న అంశాలను అమలు చేయాలన్నారు. అలాగే వికలాంగుల కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చాలా మందికి దివ్యాంగులు ఉన్నా కేవలం 5.16లక్షల మందికే పెన్షన్ అందుతోందన్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరారు. అలాగే ఉద్యోగ నియామకాల్లో శారీరక వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ్, రాష్ట్రకార్యదర్శి అడవయ్య పాల్గొన్నారు.

రేపు గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీ

మొయినాబాద్: రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 23న భర్తీ చేయనున్నట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఈ నెల 23న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు షేక్‌పేటలోని గురుకుల పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

శునకం.. భయానకం



వికారాబాద్‌లో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కల గుంపు

వీధుల్లో గుంపులుగా కుక్కల సంచారం

- పాదచారులు, వాహనదారులపై దాడులు
- చిన్నారులకూ తప్పని ముప్పు
- భయాందోళనలో జనం
- ఆహారం, నీరు దొరక్కపోవడమే దాడికి కారణమా?

వికారాబాద్ అర్బన్: జిల్లాలో రోజురోజుకూ కుక్క కాటు ఘటనలు పెరిగిపోతున్నాయి. నిత్యం ఎక్క డో ఒక చోట మనుషులపై దాడి చేసి గాయపరుస్తూ నే ఉన్నాయి. వీధులు, రోడ్లపై గుంపులు గుంపులు గా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి మరీ కరుస్తున్నాయి. అంతేకాకుండా ఇళ్లలోకి దూరి దాడి చేస్తున్నాయి. శునకా ల దాడిలో చిన్నారులు ప్రాణాలు వదిలిన సందర్భా లు అనేకం. కుక్క కాటుకు గురైన వారు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.

ఆకలితో దాడి చేస్తున్నాయా..?

ఇంతకీ కుక్కలు మనుషులపై ఎందుకు తెగబడుతున్నాయి. ఆకలితోనా లేక దూపతోనా.. ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకప్పుడు వీధి కుక్కలు మనుషులపై దాడి చేసేవి కావు. గ్రామాల్లోకి కొత్తగా ఎవరైనా వచ్చినా, వాటికి హాని చేసే జంతువులు, ఇతర ప్రాణులు ఏవైనా కనిపిస్తే దాడి చేయడం చూశాం. కానీ ఇప్పుడు మనుషులపై దాడి చేయడం ఎక్కువైంది. ఏ కుక్క మంచిదో ఏది పిచ్చిదో తెలియని పరిస్థితి నెలకొంది. శునకాల దాడికి ప్రధాన కారణం ఆకలి అని పలువురు అంటున్నారు. గ్రామాల్లో, మున్సిపలిటీల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా మెరుగుపడింది. దీంతో వాటికి ఆహారం దొరకడం లేదు. అలాగే ఇంటింటా చెత్త సేకరణ ప్రారంభమయ్యాక రోడ్డు పక్క అన్నం, ఇతర ఆహార పదార్థాలు పడేయడం తగ్గింది. దీంతో వాటికి ఆహారం దొరకడం కష్టంగా మారింది. పైగా కుక్కలు తరుచూ దాడి చేస్తుండడంతో వాటిని ఎవరూ చేరదీసి ఆహారం పెట్టడం లేదు. దీంతో అవి ఆకలికి అలమటిస్తున్నాయి. కనీసం దాహం తీర్చుకునేందుకు వీధి నల్లాల వద్ద నీరు కూడా దొరకడం లేదు. దీంతో అవి ఆకలి, దూప కారణంగా మనుషులపై దాడికి పాల్పడుతున్నాయనే ప్రచారం ఉంది.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గత ఏడాది ఏర్పాటు చేసిన ఏబీసీలో 1,429 శునకాలకు సంతానం కలగకుండా ఆపరేషన్లు చేశారు. ఆపరేషన్ల అనంతరం కొన్నాళ్ల పాటు సెంటర్‌లోనే ఉన్న కుక్కలు బయటి వచ్చాక వరుసపెట్టి జనాలపై దాడికి తెగబడుతున్నాయి. వీధి కుక్కలను ఒకేచోట పదిహేను నుంచి ఇరవై రోజుల పాటు బంధించి ఉంచడంతో అవి ఒత్తిడికి లోనై మనుషులపై దాడి చేస్తున్నట్లు తెలిసింది. తాండూరులోని ఏబీసీ సెంటర్‌లో కూడా సుమారు 1,247 కుక్కలకు ఆపరేషన్లు చేశారు.

వ్యాక్సినేషన్

ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 3వేల కుక్కలకు రేబీస్ వ్యాధి సోకకుండా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ వేశారు. అయినా ఎక్కడో ఒక చోట రేబీస్ వ్యాధితో కుక్కలు జనాలపై దాడి చేస్తున్నాయి.

ప్రతి నెలా నమోదవుతున్న కుక్కకాటు కేసులు

పీహెచ్‌సీల పరిధిలో..	వికారాబాద్ ఏరియా ఆస్పత్రిలో..
జనవరి - 48	- 56
ఫిబ్రవరి - 61	- 50
మార్చి - 72	- 64
ఏప్రిల్ - 64	- 57
మే -93	-57
జూన్ - 177	- 58
జూలై - 211	- 54
ఆగస్టు - 225	- 48

అప్రమత్తంగా ఉండాలి



రేబీస్ వ్యాధికి గురైన పశువులను కుక్కలు కరిసినా, రేబీస్ వ్యాధి ఉన్న కుక్కను మరో కుక్క కరిచినా వ్యాధి ఒకదాని నుంచి మరొక దానికి సోకుతుంది. ఆ కుక్కలు మనుషులను కరిస్తే ప్రమాదం. వెంటనే వైద్యులను సంప్రదించాలి. అయితే రేబీస్ వ్యాధి సోకుండా ప్రతి ఏటా జూన్ మొదటి వారంలోనే పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నాం. పెంపుడు కుక్కలకు కూడా వాటి యజమానులు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలి. కుక్కలను భయపెట్టడం, నేరుగా వాటివైపు చూడడం, వాటి దగ్గరగా పెద్ద చప్పుడు చేయడం వంటివి చేయరాదు. అలా చేస్తే అవి దాడిచేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

– అనిల్‌కుమార్, జిల్లా పశు వైద్యాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, ఆనంద్

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం

బంట్వారం: రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం బుగ్గాపూర్‌లోని ఫంక్షన్ హాల్‌లో జరిగింది. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే రూ. కోటికి పైగా వెచ్చించి మార్కెట్ యార్డును నిర్మించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని, కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం కేసీఆర్‌పై ప్రజలకు అపార నమ్మకం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. అనంతరం తాండూరు, వికారాబాద్ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ మాట్లాడారు. మంత్రి మహేందర్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అంతకుముందు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాణెమ్మ, వైస్ చైర్మన్‌గా ఫయాజ్, డైరెక్టర్లతో సెక్రటరీ లక్ష్మణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ జిల్లా అధికారి సారంగపాణి, కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రాజు గౌడ్, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ మహేష్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనిల్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, రైతు బంధు మండల అధ్యక్షుడు సాయన్న, నాయకులు గోపాల్‌రెడ్డి, పురుషోత్తంరావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మినీ కాదు.. మెగా డీఎస్సీ వేయాలి

అనంతగిరి: ప్రస్తుత డీఎస్సీ స్థానంలో మెగా డీఎస్సీ వేయాలని జిల్లాలోని అభ్యర్థులు డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో వారు ధర్నా నిర్వహించా రు. అనంతరం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయనుకున్న తమకు నిరాశే మిగిలిందన్నారు. ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీలో పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. కొన్ని కేటగిరీల్లో పోస్టులే లేవన్నారు. ఇంత తక్కువ పోస్టులతో డీఎస్సీ వేయడంతో మా కళ నిర్వీర్యం అయ్యిందన్నారు. మినీ డీఎస్సీ వేసి చేతులు దులుపుకోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పోస్టుల సంఖ్యను రెట్టింపు చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని వారు హెచ్చరించారు.

ఎన్నికలు సజావుగా నిర్వహిద్దాం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

- ఇది మన బాధ్యత
- ఎస్పీ కోటిరెడ్డి
- ఎన్నికల ఏర్పాట్లపై పోలీసు అధికారులకు శిక్షణ

అనంతగిరి: రానున్న ఎన్నికలు సజావుగా జరిగేలా చూద్దామని, ఇది మన బాధ్యత అని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఎన్నికల ఏర్పాట్లపై గురువారం పట్టణంలో జిల్లాలోని పోలీసు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వరాదని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి బందోబస్తు ఏర్పాటు చేయాలి, రూట్ అధికారుల విధులు, మ్యాపింగ్ తదితర వాటిపై అవగాహన ఉండాలని సిబ్బందికి సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, పట్టణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రౌడీ షీటర్స్, పాత నేరస్థుల కదలికలను గుర్తించాలన్నారు. అవసరమైతే వారిని రెవెన్యూ అధికారుల వద్ద బైండోవర్ చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో నమోదైన కేసులు, అల్లర్లు జరిగిన ప్రాంతాల గురించి పోలీస్‌స్టేషన్ల వారీగా అధికారులతో చర్చించారు. అనంతరం పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి హైదరాబాద్‌కు బదిలీ అయిన శ్రీనివాస్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ నర్సింలు, పరిగి డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి, తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- సొంత భవనాలకు నోచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు
- సగానికి పైగా అద్దె భవనాల్లోనే..
- ఇబ్బందుల్లో చిన్నారులు, గర్భిణులు
- పట్టించుకోని ప్రభుత్వాలు



దోమ మండలంలోని డ్వాక్రా భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

వికారాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో 1,106 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా సగానికి పైగా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వాటిలో సదుపాయాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కేంద్రం నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ స్థాయిలో ఏ సమావేశం జరిగినా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. కానీ ఆ దిశగా అడుగులు మాత్రం పడడం లేదు. మండల సర్వసభ్య సమావేశం జరిగిన ప్రతి సారీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతున్నారు. కానీ ఫలితం కనిపించడం లేదు. జిల్లాలో వికారాబాద్, మర్పల్లి, పరిగి, తాండూరు, కొడంగల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. కొడంగల్ పరిధిలో 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా తొమ్మిది చోట్ల మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతా కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. పరిగి ప్రాజెక్టు పరిధిలో 213 కేంద్రాలు ఉండగా 109 సెంటర్లకే సొంత భవనాలు ఉన్నాయి. మర్పల్లి పరిధిలో 148కి గాను 104 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. వికారాబాద్ ప్రాజెక్టు పరిధిలో 232కు గాను 101 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. తాండూరు ప్రాజెక్టు పరిధిలో 279 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 145 చోట్ల సొంత భవనాలు ఉన్నాయి. జిల్లాలోని అంగన్‌వాడీ సెంటర్లలో 56,900 మంది చిన్నారులు, 6,313 మంది గర్భిణులు, 5,683 మంది బాలింతలకు సేవలు పొందుతున్నారు. అయితే వసతులు లేమితో వీరు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చాలని, అలాగే వసతులు కల్పించాలని గర్భిణులు, బాలింతలు డిమాండ్ చేస్తున్నారు.

దూరవిద్య కోర్సులు డిగ్రీతో సమానం



కోర్సుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింహులు, అశోక్‌కుమార్

- ప్రొఫెసర్ జీ రాంరెడ్డి దూరవిద్యా కేంద్రం జాయింట్ డైరెక్టర్లు నర్సింహులు, అశోక్ కుమార్

తాండూరు టౌన్: ప్రొఫెసర్ జీ రాంరెడ్డి దూరవిద్యా కేంద్రం (పీజీఆర్‌ఆర్‌సీడీఈ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోర్సులన్నీ రెగ్యులర్ డిగ్రీలతో సమానమని ఆ కేంద్రం జాయింట్ డైరెక్టర్లు నర్సింహులు, అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక పీపుల్స్ డిగ్రీ కళాశాలలో వారు విలేకరులతో మాట్లాడారు. దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో 72 కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీ, యూజీ, డిప్లొమా కోర్సులను సెమిస్టర్ విధానంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఒక కోర్సును రెగ్యులర్‌గా చదువుతూ అదే సమయంలో ఒక దూరవిద్యా కోర్సును సైతం చదవడానికి వీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దూరవిద్యా కేంద్రం కోర్సులు చేయడానికి ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 88861 11690లో సంప్రదించాలని కోరారు. అనంతరం పలు కోర్సులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యానంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

30 వరకు అడ్మిషన్లు

అనంతగిరి: ఉస్మానియా విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని నరసింహ, అశోక్ కుమార్ తెలిపారు. గురువారం వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాల పీజీఆర్‌ఆర్ సీడీఈ స్టడీ సెంటర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఓయూ పరిధిలోని 10 దూర విద్యా కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వికారాబాద్ స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ల 8886111690, 9440390625లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే మందారిక, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ప్రభు, స్టడీ సెంటర్ ఇన్‌చార్జ్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుని సేవలో కలెక్టర్



స్వామివారి సన్నిధిలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

వికారాబాద్ అర్బన్: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయకుడికి గురువారం కలెక్టర్ సీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిరోజూ ఆయా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల సమన్వయ కర్త డీటీడబ్ల్యూఓ కోటాజీ తెలిపారు. పూజలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, డీపీఓ తరుణ్‌కుమార్, డీవైఎఫ్ఓ హనుమంతరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ అమరేందర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకతాయిల ఆట కట్టిస్తాం

వికారాబాద్ టౌన్ సీఐ శ్రీను



విజయచిహ్నం చూపిస్తున్న సీఐ, విద్యార్థులు

అనంతగిరి: అమ్మాయిల భద్రతే షీటీం ప్రధాన లక్ష్యమని వికారాబాద్ టౌన్ సీఐ శ్రీను తెలిపారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని వికాస్ కళాశాలలో షీటీం సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో షీటీం మఫ్టీలో కాపు కాస్తుందని.. అమ్మాయిలను ఆటపట్టించే ఆకతాయిల ఆట కట్టిస్తామన్నారు. ఏమైనా ఇబ్బంది ఉన్నట్లయితే అమ్మాయిలు షీటీం టోల్‌ఫ్రీ నంబర్ 181, 100కు గాని ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా రోడ్ సేఫ్టీ, పోక్సోచట్టం, యాంటీ ర్యాగింగ్, ట్రాఫిక్ రూల్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, షీటీం ప్రతినిధులు శ్రీనయ్య, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారం

యాలాల: వివాహితపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పగిడియాల గ్రామానికి చెందిన ఓ వివాహిత మంగళవారం పొలం వద్ద పనిచేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన శ్రీశైలం ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే రోజు సదరు మహిళ యాలాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు విచారణలో భాగంగా గురువారం తాండూరు రూరల్ సీఐ రాంబాబు, ఎస్ అరవింది ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మలుపువద్ద అదుపుతప్పి..

- బోల్తాపడిన కారు
- ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన కారు

ధారూరు: అతివేగంతో వెళ్తున్న కారు రోడ్డు మలుపులో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గురువారం సంగారెడ్డి నుంచి తాండూర్‌కు వెళ్తున్న ఓ కారు ధారూరు మండలం గట్టెపల్లి బస్‌స్టేజీ దాటిన తర్వాత మలుపులో అదుపుతప్పి రోడ్డుపక్కన గుంతలోకి పల్టీకొట్టింది. కారులో ఉన్న సాయిప్రతాప్, సాయిసునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులనుతాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

పోషకాల 'జావ'

- ప్రభుత్వ బడుల్లో రాగిజావ పంపిణీ సక్సెస్
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు
- రోగనిరోధక శక్తి పెరుగుతుందంటున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తొలుత మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఈ ఏడాది జూన్ చివరి నుంచి రాగిజావను సైతం అందిస్తుండటంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలో 50 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 5వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో కొందరు పోషకాహార లోపం, రక్తహీనతతో తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇలాంటి విద్యార్థుల సమస్యలను తొలగించేందుకు రాగిజావను అందించాలని ప్రభుత్వం భావించి రెండునెలల నుంచి ఈ పథకాన్ని పక్కాగా అమలుచేస్తోంది.

శక్తినిచ్చే ఆహారం..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల్లో అధికశాతం నిరుపేద కుటుంబాలకు చెందినవారు ఉంటారు. వీరిలో కొద్దిమంది ఉదయం పూట ఎలాంటి ఆహారం తీసుకోకుండా పాఠశాలకు వస్తుంటారు. ఈ క్రమంలో వారు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ రోగాలను అధిగమించేందుకు ఐరన్, విటమిన్ వంటి పలు పోషకగుణాలు ఉన్న రాగిజావను అందిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్యాకింగ్ చేసిన ఫోర్టిఫైడ్ రాగిపొడి, బెల్లం పొడిని ప్రభుత్వం అందిస్తోంది. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల పొడిని ఎంఈఓ కార్యాలయాలకు అందిస్తుండగా అక్కడినుంచి పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ కార్మికులకు రాగిజావ తయారీ బాధ్యతను అప్పగించారు. దీనికి తోడు విద్యార్థుల హాజరుశాతం కూడా మెరుగైంది.

ఇష్టంతో తాగుతున్నాం



మా పాఠశాలలో రోజు విడిచి రోజు రాగిజావ అందిస్తున్నారు. ఇష్టంతో తాగుతున్నాం. పౌష్టికంగా మంచిగా అనిపిస్తుంది. ఇదివరకు ఒక్కోసారి పోషకాహార లోపంతో బాధపడేవాళ్లం. ఇప్పుడు బడిలో జావ అందిస్తుండటంతో అలాంటి సమస్య ఏమీలేదు.

– తేజస్విని, విద్యార్థిని

రోగనిరోధక శక్తి పెరుగుతుంది



ప్రభుత్వం బడుల్లో రాగిజావ పథకం ఈ ఏడాది నుంచే ప్రభుత్వం ప్రారంభించింది. వారానికి మూడు రోజులు పంపిణీ చేస్తున్నాం. విద్యార్థులు ఇష్టంతో తాగుతున్నారు. ఈ జావతో విద్యార్థుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

– నర్సింహులు, ఉపాధ్యాయుడు

ఉత్సవాలను విజయవంతం చేయండి

భారత్ ముక్తి మోర్చా లంబాడా హక్కుల పోరాట సమితి నేతల పిలుపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి: సత్యశోధక్ సమాజ్ ఉత్సవాలను విజయవంతం చేయాలని భారత్ ముక్తి మోర్చా లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవిందనాయక్ కోరారు. గురువారం పట్టణ కేంద్రంలోని సత్యశోధక్ సమాజ్ మహోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సత్యశోధక్ సమాజ్ 150 సంవత్సరాల మహోత్సవం పట్టణ కేంద్రంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 23న నిర్వహిస్తున్నారన్నారు. భారతదేశంలో మూలివాసి బహుజనులకు మనువాద సంకెళ్ల నుంచి విముక్తి చేయడానికి దీనిని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనాయక్, అరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు చరిత్రాత్మకం

నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

కల్వకుర్తి: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం చరిత్రాత్మకమని నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు అన్నారు. గురువారం కల్వకుర్తి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సమాజంలో సగభాగమైన మహిళలకు ఎన్నో ఏళ్లుగా చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకపోవడంతో వారికి సరైన ప్రాతినిథ్యం దక్కలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే సీఎం కేసీఆర్ నేతృత్వంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ బిల్లు కోసం శాసనసభలో తీర్మానం చేసి.. దానిని కేంద్రానికి పంపించడం జరిగిందని గుర్తుచేశారు. మహిళలకు రిజర్వేషన్ బిల్లుతో చట్టసభల్లో వారి ప్రాతినిత్యం పెరుగుతుందని, రాజకీయపరంగా, అధికారాల పరంగా, సామాజిక పరంగాను మెరుగైన అవకాశాలు దక్కుతాయని అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆనంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు జహంగీర్ అలీ, కృష్ణ, రమేశ్, జంగయ్య, నర్సింహగౌడ్, రాజుగౌడ్ గణేశ్ తదితరులు ఉన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ అద్దె బస్సు

11 మందికి గాయాలు

- ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ప్రమాదం
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు



దెబ్బతిన్న బస్సు ముందుభాగం

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ అద్దె బస్సు ఆగివున్న డీసీఎంను ఢీకొట్టిన సంఘటనలో 11 మంది గాయపడిన సంఘటన గురువారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు స్థానిక చెరువు కట్టపై నిలిపివున్న డీసీఎం వ్యాన్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతిని, ఒక్కసారిగా కుదుపునకు గురైంది. బస్సు ముందు భాగంలో ఉన్న ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఇబ్రహీంపట్నానికి చెందిన ఎ.జగదీశ్వర్(30), బి.శ్రీలత(25), కె.మల్లమ్మ(55), హెచ్ లక్ష్మమ్మ(70), ఎస్ సుమలత(35) మంగ(31), భాగ్యమ్మ(48), సబిత(35), ఆరుట్లకు చెందిన బుగ్గరాములు(50), వికారాబాద్‌కు చెందిన యు.మల్లేశ్(19) గాయపడగా వెంటనే వీరిని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. కండక్టర్ రాములు(50) తలకు గాయం కావడంతో తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వైద్యులు అందుబాటులో లేక ఇబ్బందులు..

క్షతగాత్రులను ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు అందుబాటులో లేరు. దీంతో చికిత్సలు అందించడంలో జాప్యం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిచందు, కాంగ్రెస్ నేతలు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బూడిద నర్సింహ్మారెడ్డి తదితరులు బాధితులను పరామర్శించారు. నైట్ డ్యూటీ డాక్టర్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గాయపడిన వారిలో కొంతమంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. గాయపడిన వారెవరికీ ప్రాణాపాయ పరిస్థితి లేదని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

అభివృద్ధి జీఓలకే పరిమితమా?



సాయిపూర్ సీసీ రోడ్డుపై గుంత



ఆదర్శనగర్ కాలనీలోని ఓ వీధి

- తాండూరులో అధ్వానంగా అంతర్గత రోడ్లు
- బిల్లులు రాలేదని పనులు నిలిపేసిన కాంట్రాక్టర్!
- వార్డుకు రూ.కోటి నిధుల హామీ ఏమైందని ప్రతిపక్షాల ఎద్దేవా

తాండూరు టౌన్: తాండూరు పట్టణ అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పలు వార్డుల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు చినుకు పడితే చాలు వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని మార్కండేయ కాలనీ, స్నేహనగర్, అయ్యప్పనగర్, గ్రీన్ సిటీ, మిత్రనగర్, తులసీనగర్, సాయిపూర్, పాతతాండూరు, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. కొత్తగా మున్సిపల్ పరిధిలోకి వచ్చిన ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో సైతం రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి.

బిల్లులు రాలేదని..

పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి మొదలుకొని సాయిపూర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను మున్సిపాలిటీ వారు కాకుండా ఆర్‌అండ్‌బీ శాఖ వారు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సుమారు 800 మీటర్ల లోపు సీసీ రోడ్డు మాత్రమే పూర్తిచేశారు. మిగిలిన కిలోమీటరు పైగా రోడ్డు నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారు. అయితే సదరు కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు చేసిన పనులకుగాను బిల్లుల చెల్లింపు జరగలేదని, అందుకే రోడ్డు పనులను నిలిపివేసినట్లు సమాచారం. వెంటనే ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి మిగిలిన రోడ్డు పనులు పూర్తిచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వార్డుల అభివృద్ధి నిధులెక్కడా..?

తాండూరు పట్టణంలోని 36 వార్డుల్లో.. ఒక్కో వార్డుకు అభివృద్ధి పనుల కోసం రూ.కోటి చొప్పున కేటాయిస్తానని స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పలుమార్లు ప్రకటించారు. అంతేకాకుండా తాండూరు అభివృద్ధి నిమిత్తం రూ.134 కోట్ల నిధులను సీఎం కేసీఆర్ కేటాయించారని.. ఇందుకు సంబంధించిన జీఓ కాపీ విడులైనట్లు చెప్పారు. అయితే నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాకపోవడం, అభివృద్ధి పనులు జరుగకపోవడం చర్చనీయాంశమైంది. కేవలం జీఓలకే పరిమితమని, ఆ నిధులు విడుదలవుతాయనే నమ్మకం కూడా లేదని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. త్వరగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

'సహకార' కార్యాలయ సందర్శన



తుర్కయంజాల్ రైతు సహకార సంఘం పాలకవర్గంతో ట్రైనీ ఉద్యోగుల బృందం

తుర్కయంజాల్: తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్‌లో శిక్షణ పొందుతున్న ఉద్యోగుల బృందం స్టడీ టూర్‌లో భాగంగా గురువారం తుర్కయంజాల్‌లోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఉద్యోగులకు సంఘం సీఈఓ వై.రాందాస్.. కోఆపరేటివ్ చట్టం–1964 రూల్స్, చైర్మన్, డైరెక్టర్లు, రైతుల మధ్య సమన్వయం, ఆర్థిక వ్యవహారాలు, వ్యవసాయ ఇతర అనుబంధ అవసరాలు, భవిష్యత్ ప్రణాళికలు, మల్టీసర్వీస్ సెంటర్స్, మహాజన సభ సమావేశం వంటి అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ భూక్య వెంకన్న, కోర్సు కోఆర్డినేటర్ ఎ.విజయ, జాయింట్ రిజిస్ట్రార్ ఆర్.సురేఖ, ఆర్.సంగీత, వై.పరిమళాదేవి, బి.వసంత తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని..

వృద్ధురాలి దుర్మరణం

మంచాల: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంచాల మండలం గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. మంచాల ఎస్‌ఐ రవినాయక్ కథనం ప్రకారం.. హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిపై జేబీ వెంచర్ సమీపంలో బుధవారం రాత్రి ఓ వృద్ధురాలి(65)ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయింది. ఆమె శరీరంపై పసుపు కలర్ జాకెట్, ఆకుపచ్చ కలర్ చీర ధరించి ఉంది. గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసిన మంచాల పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు యాచకురాలు అయిఉండవచ్చని పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 85 సెల్‌ఫోన్లు, కిలోన్నర గంజాయి, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కరీంనగర్ టౌన్ ఏసీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీలు నరేందర్, మాధవి

కరీంనగర్ క్రైం: సెల్‌ఫోన్లు చోరీచేస్తూ.. అందులోని బ్యాంకు ఖాతాల్లో డబ్బులు మాయం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను కరీంనగర్ వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ జి.నరేందర్, సీసీఎస్ ఏసీపీ మాధవి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన బేతంపల్లి ఎల్లప్ప, వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం తండాకు చెందిన వడ్డె శ్రీనివాస్, హైదరాబాద్ బోడుప్పల్‌కు చెందిన మాతాజీ శివ, హైదరాబాద్‌కు చెందిన బోయ మురళీ, చిన్నా, బేతంపల్లి భూలక్ష్మి హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ముఠాగా ఏర్పడ్డారు. వివిధ జిల్లాలు తిరుగుతూ రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొంగలించడం ప్రారంభించారు. ఈ నెల 17న కరీంనగర్ కూరగాయల మార్కెట్లో వినోద్‌రెడ్డి అనేవ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించారు. అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.2.10 లక్షలు మాయం కావడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు నిందితుల కోసం గాలించారు. నిందితులైన ఎల్లప్ప, వడ్డె శ్రీనివాస్, శివ, మురళీ సికింద్రాబాద్‌లో గంజాయి కొనుగోలు చేసి కారులో కరీంనగర్ వస్తున్నారన్న సమాచారంతో వాహనాల తనిఖీ చేపట్టారు. పట్టుబడిన నిందితులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డి, దుబ్బాకతో పాటు పలు ప్రాంతాల్లో 85 సెల్‌ఫోన్లు దొంగలించామని ఒప్పుకొన్నారు.

సెల్‌ఫోన్ల ద్వారా డబ్బు మాయం..

సెల్‌ఫోన్లు చోరీ చేసి వివిధ రకాల పాస్‌వర్డ్‌లతో ఫోన్‌పే, గూగుల్ పే ఓపెన్ చేసి బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు దొంగలించే ప్రయత్నం చేశారు. రెండు సెల్‌ఫోన్లలో పాస్‌వర్డ్‌లు సులభంగా ఉండడంతో కరీంనగర్‌లో దొంగలించిన సెల్‌ఫోన్‌లోని ఫోన్‌పే నుంచి రూ.2.10 లక్షలు, దుబ్బాకలో చోరీ చేసిన మరో ఫోన్ నుంచి రూ.లక్ష కాజేశారు. నిందితుల నుంచి 85 సెల్‌ఫోన్లు, కిలోన్నర గంజాయి, రూ.45వేల నగదు, గొడ్డలి స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని రిమాండ్ చేశామని, చిన్నా, బేతంపల్లి భూలక్ష్మి పరారీలో ఉన్నారని తెలిపారు. సీఐలు రవికుమార్, లింగమూర్తి, పుల్లయ్య, ఎస్‌ఐలు స్వామి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. నందిగామలో గురువారం నిర్వహించిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, పథకాలతో సీఎం కేసీఆర్ పేదప్రజల ఇళ్లల్లో వెలుగులు నింపారన్నారు. నందిగామ మండలానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్న లత, సర్పంచ్‌లు రాజునాయక్, అశోక్, చంద్రారెడ్డి, అనిత, రమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు అశోక్, రాజ్‌గోపాల్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు కుమార్, వీరేందర్ గౌడ్, శ్రీశైలం, గోపాల్ రెడ్డి, పెంటయ్యగౌడ్, శ్రీనివాస్, నర్సింహ, నయాబ్ తహసీల్దార్ విజయ్, ఆర్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

అందరూ భాగస్వాములు కావాలి..

కొత్తూరు: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కోరారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో రూ.3.60 కోట్లతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తాయన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, నారాయణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు

జాతీయ రహదారిని పరిశీలించిన అధికారులు



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిని పోలీసుశాఖ, జాతీయ రహదారుల శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. జాతీయ రహదారిపై ఉన్న సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీంద్రనాయక్, ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం, జాతీయ రహదారుల శాఖ ఏఈ గంగాధర్ ప్రమాదాలు జరుగుతున్న స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వారు చర్చించారు.